వంతెన నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో లక్ష్మీపురం పంచాయతీ కర్లపొదోర్ గ్రామంలో వంతెన నిర్మించాలని స్థానిక సర్పంచ్ కోర్ర త్రినాథ్ స్పందన" లో అనేక దఫాలుగా దరఖాస్తులు పెట్టడంతో కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించారు. వంతెన నిర్మాణానికి ఏఈ మురళీకష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిరీష కర్లపొదోర్ గ్రామంలో పర్యటించి స్థానిక సర్పంచ్ తో గురువారం కొలతలను చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ, వర్షాకాలంలో విపరీతమైన వరదతో కర్లపోదోర్ గ్రామంతో పాటు మరో నాలుగు గ్రామాల గిరిజనులు అనేక కష్టాలకు గురవుతున్నారన్నారు. కనీసం వారపు సంతలకు వెళ్లి సరుకులు తీసుకు వచ్చేందుకు కూడా వీలు లేనంత దిగ్బంధంలో చిక్కుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్పందనలో అనేకసార్లు దరఖాస్తు చేయడంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించి వంతెన నిర్మాణానికి కొలతలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

పరిశీలిస్తున్న అధికారులు

మన్యంలో కుండపోత వర్షం

-ఉప్పొంగిన గెడ్డలు-అవస్థలు పడ్డ వాహనదారులు - పొలాలు జలమయం

ప్రజాశక్తి -అనంతగిరి:మండుతున్న ఎండలు, ఉక్క పోతతో అల్లాడుతున్న ప్రజలకు గురువారం కురిసిన భారీ కుండపోత వానతో ఉపశమనం లభించింది. గెడ్డలు, వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. గత కొద్ది రోజులుగా వర్షాలు కురువక మండు టెండలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. గురువారం మధ్యాహ్నం నుండి 4 గంటల వరకు ఉరుములతో కూడిన భారీ కుండ పోత వాన ఏకధాటిగా కురిసింది. పంట పొలాలలో వరద నీరు చేరింది. ఘాట్ రోడ్డు, శివలింపురం, డముకు, అనంతగిరి, అరుకు ప్రధాన రోడ్డులో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. రాళ్లు, రప్పలు చేరడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మండుటెండలలో ఉపాధి, ఇతర పనులు చేస్తున్న రైతులకు కాస్త ఉపశమనం కలిగింది.

పెదబయలు:మండల కేంద్రంలో కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం. ఒకేసారి ఉరుములు, మెరుపులు పిడుగు పాటుతో వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లో సంపూర్ణంగా నీరు చేరింది. ఇటుకల పండుగ. పూర్తి కావడంతో గిరిజన రైతులు నూతన. విత్తనాలు సిద్ధం చేశారు. ఈ వర్షంతో పోడు వ్యవసాయంపై దృష్టి సారించనున్నారు.

అనంతగిరిలో కురుస్తున్న వర్షం

అరకులోయలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

అరకులోయ రూరల్:అనంతగిరి మండలం బీసుపురం ఘాట్ రోడ్ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం భారీ కుండపోత వర్షం కురిసింది. దీంతో రెండు గంటల పాటు జనజీవనం స్తంభించి పోయింది. రెండు గంటలు ఏకధాటిగా కురిసిన భారీ వర్షం కారణంగా బీసుపురం ఘాట్ రోడ్డుపై వరద నీరు నిలిచి పోవడంతో వాహన చోదకులు రెండు గంటల పాటు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షం కారణంగా బీసుపురం పరిసర ప్రాంతాల కొండ కాలువల్లో వర్షపు నీరు పొంగి ప్రవహించింది.

పొలాలు జలమయం

మండలంలోని సుంకరమెట్ట పంచాయితి పరిధిలో గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ కుండపోత వర్షానికి పంట పొలాలు జలమయమయ్యాయి. వర్షానికి సంఘంవలస గ్రామానికి చెందిన వంతాల డేవిడ్ అనే గిరిజనుడుకు చెందిన రెండు ఎకరాల్లో వరదనీరు చేరడంతో సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్ట పరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

సిఐటియు నిరసన

ప్రజాశక్తి-పాడేరు:మహిళ రెజర్లపై లైంగికంగా వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపి బీజు భూషణ్ చరన్ సింగ్‌ను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఇతర ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, జంతర్ మంతర్ వద్ద వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపీ పై చర్య తీసుకోవాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మైనర్ బాలిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని తెలిపారు. మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి దేశంలో కళాకారులకి, క్రీడాకారులకు, మహిళలకి, దళితులకు, గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రెజర్ల జాతీయ ఫెడరేషన్ అధ్యక్షుల్ని తక్షణం తప్పించాలని డిమాండ్ చేశారు. కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సహించాల్సింది పోయి బిజెపి ఎంపీ వేధింపులకు గురి చేయడం సరికాదని తెలిపారు. తక్షణం బిజెపి ఎంపీని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పడాల్, ఉపాధి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి యస్ బి పోతురాజు, ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.మంగమ్మ, జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌర అధ్యక్షులు పి.బాలదేవ్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందర్రావు, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిట్టి నాగరాజు, సిఐటియు నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన

బిజెపి ఎంపీపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

ప్రజాశక్తి-మోతుగూడెం

మహిళా రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన చింతూరు మండలం తులసిపాక గ్రామంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఢిల్లీలో రెజ్లింగ్ క్రీడాకారులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్, మరి కొంతమంది కోచ్‌లు తమను లైంగికంగా వేధింపులకు పాల్పడుతూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని మూడు నెలల క్రితం రెజ్లర్లు ఆందోళన చేపట్టి కేంద్ర కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా మోడీ ప్రభుత్వం నేటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు. అంతర్జాతీయంగా పతకాలు సాధించి దేశ ప్రతిష్టను, గౌరవాన్ని పెంచిన మల్ల యోధులపై వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్రం బ్రిజ్ భూషణ్, ఇతరులపై చర్యలు తీసుకోవాలని, మల్లయోధులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పర్యాటక పనులు వేగవంతం చేయాలి

ఐటిడిఎ పిఓ అభిషేక్

ప్రజాశక్తి-అరకులోయ:ఐటిడిఏ పరిధిలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం అరకు వ్యాలీ మండలంలో పర్యటించిన పివో పద్మాపురం గార్డెన్‌లో నిర్మిస్తున్న ట్రీ హట్స్, కొత్తవలస హెచ్ఎన్‌టిసిలో నిర్మిస్తున్న కాటేజీల పనులను పరిశీలించారు. కాటేజీల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకుని రావాలని ఆదేశించారు. చాపరాయిగెడ్డ సుందరీకరణ పనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. నిర్మాణ పనులలో పటిష్టమైన నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. నాణ్యమైన నిర్మాణ సామగ్రిని వినియోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిఇ సుబ్బారావు, మ్యూజియం మేనేజర్ మురళి, పద్మాపరం గార్డెన్ మేనేజర్ బొంజుబాబు, గిరిజన సంక్షేమ శాఖ జెఇ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-హుకుంపేట:మండల మండల కేంద్రంలోని ఈతకు దిగి మృతి చెందిన బాధిత విద్యార్థి కుటుంబాన్ని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు సివేరి అబ్రహం గురువారం పరామర్శించారు. వారిని ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హైవే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుండి వచ్చే నష్టపరిహారం త్వరగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, హుకుంపేట మండల తెలుగు యువత అధ్యక్షుడు కామేశ్వరరావు, సీనియర్ నేత స్వామి, వార్డ్ మెంబర్ పాడి వేంకట్, తెలుగు యువత సురేష్, కామేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న అబ్రహం

వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా క్షయ నియంత్రణ అధికారి

క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు పెంచాలి

ప్రజాశక్తి- కూనవరం

ప్రభుత్వ ఆసుపత్రుల్లోని టీబీ కేంద్రాలలో క్షయ నిర్ధారణ పరీక్షలు పెంచాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ టీబీ ల్యాబ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. క్షయ రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు. రోగులు రెగ్యులర్‌గా మందులు వాడుతున్నారో లేదో సమాచారం వైద్య సిబ్బందితో పాటు టీబీ సూపర్‌వైజర్లు తెలుసుకొని సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. టీబీ రోగులు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం టీబీ వార్డులోని రికార్డులు పరిశీలించారు. అక్కడ చేస్తున్న పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ విగ్నేష్, వైజాగ్ డిటీసీ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ పి.పుల్లయ్య, హెడ్ నర్స్ బి.బొజ్జి, టీబీ సూపర్ వైజర్లు రవ్వా రామాంజనేయులు, చిచ్చడి భారతి, టీబీ ల్యాబ్ టెక్నీషియన్ కాకా సుబ్బారావు, ఎల్‌టీలు సోమన్న దొర, దేవీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత సురేంద్ర

11న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చ రాదని, అసెంబ్లీలో ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టేందుకు ఏపీ గిరిజన సంఘం నిర్ణయించింది. ఏపీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ సమావేశం గురువారం పాడేరు గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించారు ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనరస హాజరయ్యారు. వివిధ మండలాల నుంచి ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యవర్గం ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ మేరకు మే 11న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ప్రధానంగా బోయ/వాల్మీకుల్ని ఎస్టి జాబితాలో చేర్చరాదని, గిరిజన రైతులు సహకరించే చింతపండుకు గిట్టు బాటు ధర కల్పించాలని, కిలో ధర 60 రూపాయలు చొప్పున జిసిసి ద్వారా కొనుగోలు చేయాలనే డిమాండ్ పై కలెక్టరేట్ ముట్టడి చేపట్టేందుకు నిర్ణయించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం గిరిజన సలహా మండలి, ట్రైబల్ కమిషన్‌లో ఎటువంటి చర్చ జరపకుండా ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానాలు చేయడం సరికాదని, ఇది రాష్ట్రంలోని గిరిజన ప్రజానీకాన్ని మోసగించడం అవమానించడమేనని గిరిజన సంఘం జిల్లా కమిటీ అభిప్రాయపడింది. ప్రభుత్వం వీటిపై తక్షణమే స్పందించే వరకు పోరాటం సాగించాలని గిరిజన సంఘం నిర్ణయించింది. ఈ సమావేశంలో ఏపీ గిరిజన సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు పాలికి లక్కు.. జిల్లా కమిటీ సభ్యులు ఎంఎం శ్రీను. చిరంజీవి కుర్ర నరసయ్య పాంగి రామన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి ఏనుగు రాయి సచివాలయం గేదెలబూరుగు, చిప్పపుట్ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించామని వైద్యాధికారి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రత్యేకమైన వైద్య శిబిరంలో 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందరూ సాధారణ జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు.వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే నిర్లక్ష్యంగా వ్యవహరించ కుండా వైద్యాధికారులను సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కే.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

బిజెపి నుండి దేశాన్ని రక్షించుకుందాం

-4న చింతూరు బహిరంగ సభకు తరలిరండి -సిపిఎం నాయకుల పిలుపు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- చింతూరు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గడిచిన తొమ్మిదేళ్లగా దేశ సంపదలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని, మరో వైపు మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలికలు తెస్తుందని, బిజెపి నుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ అన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మే 4న చింతూరులో జరుగు బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం సిపిఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, సిపిఐ జాతీయ నాయకులు రావూరి వెంకయ్య, రెండు పార్టీల జిల్లా నాయకులు ప్రసంగిస్తారని, చింతూరు డివిజన్ 4 మండలాల ప్రజానీకం వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కుంజా సీతారామయ్య, పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి, శ్రీనివాస్, పోడియం లక్ష్మణ్, తెపల్లె లక్ష్మయ్య, సలీమ్ పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం తులసిపాక గ్రామంలో సిపిఎం ఆధ్వర్యాన ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, రైల్వే, రక్షణ, స్టీల్‌ప్లాంట్, విమానాశ్రయాలు, బొగ్గు గనులు, వాడరేవులు అన్నిటిని చౌకగా కార్పొరేటర్లకు ధారాధత్తం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విధానాలకు రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు వత్తాసు పలకడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో, మల్లేష్, లక్ష్మయ్య, ముత్తయ్య, దుర్గారావు, తమ్మయ్య, చిన్న కనకయ్య పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయితీ పరిధి చింతరేగుపల్లి గ్రామంలో ప్రచార భేరి కార్యక్రమం సిపిఎం నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీలను కలిశారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.150 కూలి వస్తుందని, రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుండి వికలాంగులకు 50శాతం రాయితీ రావాల్సి ఉందని, వెంటన రాయితీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వడ్లాది రమేష్, కుంజా నాగిరెడ్డి, కార్యకర్తలు ముత్యాల శివశంకర్, శ్రీరామ్మూర్తి నరసింహారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న చిన్నబాబు తదితరులు

తహశీల్దారుగా తాతారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -అడ్డతీగల

అడ్డతీగల మండల తహశీల్దారుగా తాతారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తాతారావు ఇప్పటి వరకు వై.రామవరం మండల తహశీల్దారు పనిచేస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి పుష్ప గుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు అడ్డతీగల తహశీల్దారుగా పనిచేసిన శ్రీనివాస్ వై.రామవరం తహశీల్దారుగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు తేజస్విని, మోహన్, భాను ప్రకాష్, ఎంఆర్ఐ ఎర్రపు దొర, విఆర్ఓ బాలయ్య, మురళీకృష్ణ, చెల్లందాస్, శ్రీను, వెంకయ్యమ్మ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తాతారావుకు, బదిలీ అయిన శ్రీనివాస్‌కు పుష్ప గుచ్ఛాలు అందిస్తున్న సిబ్బంది

ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, టిడిపి నాయకులు

ఉట్లలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని ఉట్ల గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు ఆధ్వర్యాన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపికి చెందిన చవలం భద్రందొర టిడిపిలో చేరారు. ఆయనకు రాజేశ్వరి పార్టీ కుండువా కప్పి సాధనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముర్రం లక్ష్మి, టిడిపి నాయకులు కారం సింహాచలం, దిడ్డి జనార్ధన్, మచ్చ అబ్బులు, సోడి సోమన్నదొర, పండా వెంకన్న దొర, ప్రసాద్, సోడి లక్ష్మి, చవలం వెంకన్న దొర, మడకం నర్సిమూర్తి, బాబ్జీ, కోసు నాగన్న దొర, మడకం రవి, పండా గంగాభవాని, పూసం సుబ్బయమ్మ, కారం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వరూప ఫౌండేషన్ ఆధ్వర్యాన వృద్ధులకు భోజనాలు

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని తామరపల్లి గ్రామంలో స్వరూప ఫౌండేషన్ ఆధ్వర్యాన వృద్ధులకు భోజనాల ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వంశి కుంజం మాట్లాడుతూ వృద్ధులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ప్రతి రోజూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి మడి ప్రవీణ్‌ను అభినందించారు. ఇటువంటి సేవలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ తమన్న, గ్రామ పెద్దలు కంగాల వెంకన్న, వేమన్న, కుంజం వెంకన్న పాల్గొన్నారు.

భోజనాలు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

మాట్లాడుతున్న ఎంఇఒ రామచంద్రరావు

సోషల్ ఆడిట్ పై అవగాహన

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: మండలంలోని ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి పాఠశాలలకు వచ్చే నిధులపై ఏ విధంగా సోషల్ ఆడిట్ చేపట్టాలనే దానిపై గురువారం మండల కేంద్రంలో ఎంఈఓ ఎస్ రామచంద్రరావు అవగాహన కల్పించారు. పాఠశాలలకు మంజూరైన నిధులపై ప్రతి ఏడాది తప్పనిసరిగా ఆడిట్ నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ విద్యార్థుల ఉత్తీర్ణత

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 43.18 శాతం ఉత్తీర్ణులు కాగా ,ప్రథమ సంవత్సరంలో 38.52 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ద్వితీయ సంవత్సరంలో 88 మంది విద్యార్థులు హాజరు కాగా 38 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో122 విద్యార్థులు హాజరు కాగా 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ కె పార్వతి తెలిపారు. కేజీబీవీ ఇంటర్మీడియట్ లో ఎంపీసీ ఒక గ్రూపు మాత్రమే ఉంది. అందులో ప్రథమ సంవత్సరంలో 28 మంది విద్యార్థులు ఉండగా, ద్వితీయ సంవత్సరంలో 32 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. ప్రస్తుతం వెలువడిన ఇంటర్మీడియట్ రిజల్ట్స్ లో ద్వితీయ సంవత్సరం నుంచి ఎంపీసీ గ్రూపులో ఒక్క విద్యార్థిని మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం నుంచి ఒక్కరు కూడా ఉత్తీర్ణులు కాలేదని కేజీబీవీ ఎస్ఓ తెలిపారు.

హైవే పనుల్లో ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలో చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో గుత్తేదారుడు కనీస ప్రమాణాలు పాటించాలని గిరిజన సంఘం కార్యదర్శి కష్ణారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ, జాతీయ రహదారి నిర్మాణంలో ఇసుక, రాయి సేకరణకు స్థానిక పంచాయతీలకు పన్ను చెల్లించాల్సి ఉందన్నారు. రోడ్డుకి వాటరింగ్ చేసేందుకు తవ్విన గుంతలో మునిగి జ్ఞాన దీపక్ చనిపోయాడని తెలిపారు. బాలుడు మతికి గుత్తేదారుడే నిర్లక్ష్యమే కారణమని స్పష్టం చేశారు. లారీల పై లోడు తరలించేటప్పుడు వాటిపై పరజాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోక పోవడంతో వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.ఇప్పటికైనా కలెక్టర్, పిఓ, సబ్ కలెక్టర్‌లు పర్యవేక్షించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కిడారి చొరవతో ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి- పెదబయలు: మాజీ మంత్రి కిడారి శ్రవణ్ కుమార్ చొరవతో స్వంత వాహనంలో క్షత గాత్రులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. విజయనగరానికి చెందిన. వి కోదండ, పెదబయలు గ్రామానికి. చెందిన చెండా తోయజాక్షి, లక్ష్మీపేట పంచాయతీ చెందిన వంతల సంతోష్, డ్రైవర్ చెండా బాలకష్ణులు ప్రయాణిస్తున్న జీపు కుజబంగి సమీపంలో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. మాజీమంత్రి శ్రవణ్ కుమార్ జీపు వెనకాల వస్తున్నారు. జీపు ప్రమాదానికి గురైన తక్షణమే స్పందించిన శ్రవణ్ కుమార్ తన స్వంత వాహనంలో క్షత గాత్రులను స్థానిక ప్రాథమిక. ఆరోగ్య కేంద్రంకు తరలించారు.మెరుగైన. వైద్యం కోసం పాడేరు. ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గ్రంథాలయాన్ని బలోపేతం చేస్తాం : వీసీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని డాక్టర్ విఎస్.కృష్ణ గ్రంథాలయాన్ని మరింత బలోపేతం చేస్తామని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గ్రంథాలయంలో వినియోగానికి నూతనంగా అందుబాటులోకి వచ్చిన సోల్ 3.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

శ్రమ దోపిడీలో కార్మికవర్గం

సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి -పాడేరు: మే డే కార్మిక దినాన్ని ఉత్సాహంగా నిర్వహించాలని కార్మిక వర్గాలకు సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు జిల్లా విస్తత స్థాయి సమావేశం పాడేరు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోడీ పాలనలో బిజెపి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున కార్మిక, శ్రామిక వర్గం శ్రమ దోపిడికి గురవుతున్నాయన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తోన్న కేంద్రంపై పోరాటం చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. మే డే స్ఫూర్తితో బలమైన కార్మిక పోరాటాలు నిర్వహించి ప్రభుత్వాలు కదిలేలా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి శెట్టి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు గడుతూరి సత్యనారాయణ, వై.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ఉత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో మే 7, 8, 9 తేదీల్లో జరిగే మోదకొండమ్మ జాతర పోస్టర్లను మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వద్ద అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే మోదకొండమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. అందరూ సహకారం అందించి పండగ అంగరంగ వైభవంగా జరిగేందుకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజబాబు. జడ్పిటిసి. ఒగం మత్స్యలింగం, స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ, ఆలయ కమిటీ అధ్యక్షులు అనిల్, వైసిపినాయకులు రవిప్రసాద్, మాజీ జెడ్పిటిసి కుర్ర కాసులమ్మ, కమిటీ సభ్యులు గోవిందు, లక్ష్మయ్య, అప్పారావు, ప్రసాద్, సూర్యకాంతం, వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ తదితరులు

ఉద్యోగాలకు ఎనిమిది మంది ఎంపిక

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ కస్టోమైజిడ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ డ్రైవ్ స్థానిక జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు.. ఈ జాబ్ డ్రైవ్‌లో యోకోహామా టైర్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూ చేశారు.ఈ డ్రైవ్‌లో 34 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 08 మంది సెలక్ట్ అయ్యారని జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ప్లేస్ మెంట్ ఎగ్జిక్యూటివ్ యం.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు

అధ్యాపకుల కొరత.. పడిపోతున్న ఉత్తీర్ణత...

- ఇంటర్‌లో తప్పిపోయిన పేద విద్యార్థులు
- ఐదు కెజిబివి, రెండు జూనియర్ కళాశాలు, ఒక హైస్కూల్ ప్లస్‌లో జీరో ఫలితాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కెజిబివి) అధ్యాపకుల్లేక ఇంటర్ ఫలితాలు ఏడాదికేడాది పడిపోతున్నాయి. అధ్యాపక ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీచేయకపోవడం, అతిథి అధ్యాపకులను సకాలంలో నియమించక పోవడం వంటి పలు కారణాలతో ఈ విద్యాలయాల్లో ఉత్తీర్ణత గతేడాది కంటే తగ్గింది. పేద విద్యార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థలపై ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖాళీలు భర్తీచేయకపోవడంతో సబ్జెక్టు అధ్యాపకుల కొరత వెంటాడ్డం, పరీక్షలకు మూడు, నాలుగు నెలల ముందు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అనుమతివ్వడం, నియమిత గెస్ట్ ఫ్యాకల్టీకి సరిగా జీతాలు చెల్లించకపోవడం వంటి పలు కారణాలు వల్ల ఫలితాలు గతేడాది కంటే తగ్గాయి. ఇంటర్ మొదటి ఏడాదిలో ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండేళ్ల నుంచి జీరో ఫలితాలొస్తున్నాయి. పాడేరు డివిజన్‌లోని అనంతగిరి జూనియర్ కళాశాలలో వంద మంది విద్యార్థులకు ఒక్కరూ పాసవ్వలేదు. గంగవరంలోని హైస్కూల్ ప్లస్‌లో 21 మందిలో ఒకరూ ఉత్తీర్ణులుకాలేదు. 28 కెజిబివిల్లోని మొదటి ఏడాది పరీక్షలు రాసిన అనంతగిరి, చింతపల్లి, యాడపల్లివలస, కిలగొడ, డుంబ్రిగుడ కెజిబివిల్లో జీరో ఫలితాలొచ్చాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కూడా అనంతగిరి, చింతపల్లి కెజిబివిల్లో జీరో ఫలితాలురాగా, కిలగొడలో 34 మంది విద్యార్థులకు ఒక్కరే పాసయ్యారు.

ఉమ్మడి జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 2022 ఇంటర్ మొదటి ఏడాదిలో 22.03 శాతం, రెండో ఏడాది 39.27 శాతం ఉత్తీర్ణులుకాగా, 2023లో మొదటి ఏడాదిలో 20.72 శాతం, రెండో ఏడాదిలో 32.60 శాతానికి ఫలితాలు పడిపోయాయి. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 5,787 మంది పరీక్షలు రాయగా 1199 మంది పాసయ్యారు. రెండో ఏడాది పరీక్షలు రాసిన 6,043 మంది విద్యార్థుల్లో 1970 మంది ఉత్తీర్ణులయ్యారు. 28 కెజిబివిలో మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన 816 మంది బాలికలకు 237 మంది, రెండో సంవత్సరం పరీక్షలు రాసిన 909 మంది బాలికల్లో 447 మంది పాసయ్యారు. 2019లో ఆనందపురం జూనియర్ కళాశాల మంజూరుచేసినా అధ్యాపకులను భర్తీచేయలేదు. దీంతో 2022లో ఇంటర్ మొదటి సంవత్సరంలో పరీక్షలు రాసిన 29 మంది విద్యార్థుల్లో ఒక్కరూ పాసవనట్లే, ఈ ఏడాది పరీక్షలు రాసిన 11 మందిలో కూడా ఒక్కరూ పాస్‌కాలేదు.

ఇంటర్ తరగతులు ప్రారంభించే నాటికి అధ్యాపకుల నియామకం జరగాల్సివుంది. డిసెంబరులో నియామకాలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. అతిథి అధ్యాపకుల నియామకం జనవరిలో చేపట్టారు. పరీక్షలు మార్చిలో జరిగాయి. అతిథి అధ్యాపక నియామకాలకు, పరీక్షలకు మధ్య వ్యవధి మూడు నెలలు కూడా లేకపోవడంతో సిలబస్ పూర్తికాలేదు. దీంతో జూనియర్, కెజిబివిల్లో అత్యధిక మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేకపోయారు. గతేడాది కూడా అతిథి అధ్యాపకులు నియామకానికి ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ జనవరి చివరి వారంలో అనుమతిస్తే, ఫిబ్రవరిలో నియామకాలు పూర్తిచేశారు. ఈ ఏడాది దాదాపు నియామకాలు అలానే జరిగాయి. అనంతగిరి కెజిబివిలో ఫిజిక్స్ బోధించే అధ్యాపకుడు లేరు. సబ్జెక్టు అధ్యాపకుల కొరత ప్రభుత్వ ఇంటర్ విద్యాలయాల్లో వెంటాడుతోంది. అధ్యాపకుల కొరత ప్రభావం విద్యార్థుల ఉత్తీర్ణతపై పడింది.

ఎయుతో ఎక్సైజ్ శాఖ అవగాహన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రాయూనివర్సిటీతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంలో భాగంగా ఏయులో ఆల్కహాల్ టెస్టింగ్ కోసం ప్రాంతీయ ప్రయోగశాలను ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.3 కోట్ల పరికరాలతో ప్రాంతీయ స్థాయి ప్రయోగశాలను ఏర్పాటు చేయనుంది. వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బెండపూడి శ్రీనివాసు అవగాహన ఒప్పందంలో సంతకాలు చేశారు.

ఎయును సందర్శించిన సిటియు వీసీ టివి.కట్టమణి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (ఆంధ్రప్రదేశ్) ఉపకులపతి ఆచార్య టివి.కట్టమణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు.

ప్రజా సేవకుడు కృష్ణమూర్తి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సింగరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజా సమస్యలపై నిరంతరం అలుపెరగని పోరాటం చేసిన ప్రజా సేవకుడు వి.కృష్ణమూర్తి అని సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్.నర్సింగరావు కొనియాడారు. ఆరిలోవకు చెందిన సిపిఎం సీనియర్ నేత, పార్టీ జిల్లా కార్యాలయ అకౌంటెంట్ కృష్ణమూర్తి హఠాన్మరణం నేపథ్యంలో ఆ కుటుంబ సభ్యులను సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ స్థానిక నాయకులతో కలిసి నర్సింగరావు పరామర్శించారు.

ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ కృష్ణమూర్తి మరణం అతని కుటుంబానికే కాకుండా, పార్టీకి, ఈ ప్రాంత ప్రజా ఉద్యమానికి తీరని లోటన్నారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆరిలోవ ఆవిర్భావం నుంచి ఈ ప్రాంతంలో పార్టీని, ప్రజా సంఘాలను నిర్మించడంలో కృష్ణమూర్తి కృషి మరువలేనిదన్నారు. కృష్ణమూర్తితోపాటు ఆయన భార్య అన్నపూర్ణ ఐద్వా సంఘంలోనూ, పార్టీలోనూ కీలక పాత్ర పోషించారన్నారు. నిరాడంబరమైన జీవితం, పిల్లలిద్దరికీ కులాంతర వివాహాలు చేసే ఆదర్శభావాలు, మరణించాక తన కళ్లను వేరొకరి కంటిచూపు కోసం, దేహాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల కోసం అందించిన ఆదర్శనీయుడని కొనియాడారు. దోపిడి లేని సమాజం నిర్మించడం కృష్ణమూర్తి సిద్ధాంతమని, అటువంటి ఆశయసాధన కోసం అందరం పనిచేయడమే ఆయనకిచ్చే ఘననివాళి అన్నారు. నర్సింగరావుతోపాటు స్థానిక సిపిఎం నేతలు వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, కె.సత్యనారాయణ, సన్యాసిరావు ఉన్నారు.

అమృతరావుకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న కార్మిక, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి- ఉక్కునగరం : విశాఖ ఉక్కు సాధకులు, స్వాతంత్ర సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు 34వ వర్ధంతి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ హిల్ టాప్ గెస్ట్ హౌస్ వద్ద అమృతరావు విగ్రహానికి ప్లాంట్‌లో పలు యూనియన్‌లు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆవిర్భావం కోసం ఆమరణ దీక్షతో తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అమృతరావు అని గాంధీ మిషన్ కన్వీనర్ ఎవి రమణరావు కొనియాడారు. ప్రాణత్యాగాలతో సాధించిన స్టీల్‌ప్లాంట్‌ను, అవసరమైతే అమృతరావు స్ఫూర్తితో మళ్లీ ప్రాణత్యాగాలతోనే ప్రైవేటుపరం కాకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇంటక్ అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. కార్యక్రమంలో జెర్రిపోతుల మోహన్‌కుమార్, కోరాడ వెంకటరావు, కారు రమణ, బొండా ఎల్లాజీరావు, విల్లా రాంమోహన్‌కుమార్, పరంధామయ్య, నీల్తాటి రాజు, పల్లా పెంటారావు, డి మధు, వీరబాబు, దుప్పాడ అప్పారావు, కొణతాల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -రంపచోడవరం

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేలో కార్మికులంతా పాల్గొని, వాడ వాడలా ఎర్రజెండాలను ఎగురవేసి విజయవంతం చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.నిర్మల, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా నాయకులు కెవి.రామలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎందరో కార్మికులు పోరాటాల నుంచి పుట్టిందే మేడే అని పేర్కొన్నారు. ప్రపంచంలో కార్మికులు 8గంటల పని విధానం, కనీస వేతనాలు, సౌకర్యాలు సాధించుకున్నారని తెలిపారు. నేడు దేశంలో పాలకులు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, వాటిని రక్షించుకోవడం కోసం మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు రాణి, కె వెంకటలక్ష్మి, జి బేబిరాణి, రత్నకుమారి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.సిరిమల్లిరెడ్డి పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని కార్మికులంతా మే1న కార్మిక దినోత్సవంలో పాల్గొని విజయవంతం సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. మండలంలోని ములకలపల్లిలో గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8 గంటల పని దినం కోసం జరిగిన కార్మిక పోరాటం మేడేగా ప్రసిద్ధి కెక్కిందన్నారు. మేడే రోజు అంగన్‌వాడీ, ఆశ, మిడ్డేమీల్ వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు, ఎలక్ట్రికల్, కార్పెంటర్, హమాలీ, ఆటో, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరూ ప్రతి గ్రామంలోనూ జెండాను ఎగరవేయాలని కోరారు. రేఖపల్లి సిపిఎం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ నేత నిర్మల

ఆటోనగర్‌లో ప్రారంభమైన బిజినెస్ ఎక్స్‌పో

జ్యోతిప్రజ్వలనతో ఎక్స్‌పో ప్రారంభిస్తున్న పరిశ్రమల జిఎం గణపతి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లో ఫ్లోరిస్ క్రియేషన్ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్, బిజినెస్ ఎక్స్‌పోను గురువారం ప్రారంభించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్ గణపతి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించిన ఎక్స్‌పోలో రాష్ట్రంలోని వివిధ కంపెనీల ఉత్పత్తులను ఇక్కడ వందస్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న మధ్యతరహా పరిశ్రమలను ఆదుకోవడానికి అనేక రాయితీలు కల్పిస్తున్నాయన్నారు. సందేహాలుంటే తమ కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చన్నారు. వాసవి ప్రధాన కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ, చిన్న పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.. ఎంఎస్ఎంఇ ఎడి చంద్రమౌళి మాట్లాడుతూ, గతంలోనూ ఇలాంటి ఎక్స్‌పోలను ఏర్పాటు చేశామని, వీటివల్ల పరిశ్రమల యజమానులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల యజమానులు కృష్ణప్రసాద్, వై సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక సిఐటియు నేత కణితి అప్పలరాజు తన కుమారుడు దుర్గాప్రసాద్ శివ ఆరో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం గురువారం సీతానగరం ప్రభుత్వ పాఠశాలలోని 66మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి రమణారెడ్డి మాట్లాడుతూ, తన కొడుకు జ్ఞాపకార్థం అప్పలరాజు ఏటా మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు శ్రీనివాస రాజు, నమ్మి రమణ, నమ్మి అప్పారావు, కెవి రమణ, ఒబిసి సీమసిరి శ్రీను, ముద్దుర్తి శ్రీరామమూర్తి, హెచ్ఎంఎస్ దొమ్మట అప్పారావు, కొవిరి అప్పలరాజు, పాలు వెంకయ్య, నమ్మి అప్పలనాయుడు, కుదాసి వంశీ, హరి, ఎం సాంబ, రాయల్ లక్ష్మణరావు, గంగాధర్, నక్క అప్పారావు, దేశెట్టి అప్పారావు, సిహెచ్ ఈశ్వరరావు, ఎన్ వెంకటేష్, కెవి చారి పాల్గొన్నారు..

పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాయి

5న ఆదివాసీ జెఎసి డివిజన్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - రంపచోడవరం

ఆదివాసీ జెఎసి డివిజన్ కమిటీని ఈ నెల 5వ తేదీన ఏర్పాటు చేయనున్నట్లు జెఎసి నాయకులు కంగాల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి చైర్మన్ డాక్టర్ టి.బాబూరావు నాయుడు, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని, ఏడు మండలాల్లో ఉన్న ఆదివాసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెద్దలు, మేధావులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. డివిజన్ కమిటీ ఏర్పాటు అనంతరం బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని ఒకే అజెండాతో పోరాటం చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి- గాజువాక : మహిళా రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్ సింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని డివైఎఫ్ఐ గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు తమకు న్యాయం చేయాలని బాధిత రెజ్లర్లు నాలుగురోజులుగా ధర్నా చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న బ్రిజ్ భూషణ్ సింగ్‌పై ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

కాలేజీ టాపర్స్‌గా నిలిచిన మనోహర్, ధారకృష్ణ, డేవిడ్‌రాజు

ప్రజాశక్తి- మధురవాడ : ఇంటర్ ఫలితాల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శివప్రసాద్ తెలిపారు. పాడేరు ఐటిడిఎ ఆధ్వర్యంలో మారికవలసలో ఐఐటి,నీట్, లాసెట్ శిక్షణ పొందుతున్న తమ కాలేజీ విద్యార్థులు 96 మంది ఇంటర్ పరీక్షలకు హాజరుకాగా, వారిలో 94 మంది ఉత్తీర్ణులై , 98శాతం ఫలితాలు సాధించామన్నారు. ఎంపిసి విద్యార్థి మనోహర్ 952 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలవగా, బైపిసిలో బి.ధారకృష్ణ 947, ఆర్ట్స్ కేటగిరిలో బి. డేవిడ్‌రాజు 901 మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు. 96మందిలో 10 మంది విద్యార్థులకు 900కు పైబడి మార్కులు వచ్చాయన్నారు. విద్యార్థులను పిఒ వి.అభిషేక్, గిరిజన సంక్షేమ డిడి కొండలరావు అభినందించారన్నారు.

విశాఖలో చిత్రీకరించిన సినిమాలన్నీ హిట్!

ప్రజాశక్తి- ఉక్కునగరం : విశాఖలో చిత్రీకరించిన సినిమాలన్నీ హిట్ అవ్వడం ఖాయమని వైసిపి గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. గురువారం దువ్వాడ సెక్టర్-1, రామాలయంలో వరలక్ష్మి క్రియేషన్స్ బ్యానర్‌పై 'నేను ఆ అమ్మాయిని ప్రేమించాను, కానీ' సినిమా ముహూర్తం షాట్‌కు క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు విశాఖలో నిర్మించిన సినిమాలన్నీ మంచి ప్రేక్షకాదారణ పొందాయని, ఈ సినిమా కూడా విజయం సాధించి, నిర్మాతకు మంచి లాభాలతో నటీనటులు, సాంకేతిక నిపుణులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, దువ్వాడ సిఐ. శ్రీనివాసరావు, హీరో బొత్స రామ్, సుమల, మౌర్య కర్ణిక, ఎపి మా అసోసియేషన్ కార్యదర్శి వై.అప్పారావు, సినీ ఆర్టిస్ట్ సముద్రం వెంకటేష్, చంద్రశేఖర్, హీరోయిన్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.